# ప్రేమ సాగరం

-డి. శ్రీధర్

**విస్తరించిన నగరానికి ఆనించి, ఆనందపురికాలనీ విద్యుద్దీపాల వెలుగులో వైకుంఠపురిలా ఉంది. ఆకాశంలో పూర్ణచంద్రుడు చక్కగా ముస్తాబయి షికారుకు బయలుదేరిన కలవారి అబ్బాయిలా కళకళ లాడ్తున్నాడు.**




గాలితెరలు చల్లగా పయ్యెదమీదుగా సయ్యాట లాడుతున్నాయి.

డాబామీదనిల్చుని ఆకాశాన్నీ, పండువెన్నెలనీచూస్తూ అనుభూతిపొందుతోన్న అపూర్వ రెక్కలు విప్పి నవసంతాన్ని ఆహ్వానించే కోయిలలావుంది. ఆమె మనసు - పరువాల ప్రణయ పర్వాన్ని తీవ్రంగా గుర్తుచేస్తోంది.

బరువెక్కిన గుండెల్లో, తనువులో, అణవణువూ తీయగా మూల్గింది. ఎక్కణ్ణుంచో స్టీరియోపాట 'రానిక నీ కోసం సఖీ రాధిక వసంతమాసం' ఘంటసాలగొంతు విరహాన్ని పలికిస్తోంది.

అపూర్వ నిట్టూర్పు విడుస్తూ పచార్లు ఆపి ఈజీచెయిర్ లో వాలింది. దూరాన పాట ఆగింది. కరెంటు పోయినట్లుంది.

ఆరబోసిన వెన్నెల్లో అపూర్వకు 'ఎంకి' పదాలు గుర్తొచ్చాయి. 'వెన్నెలంటె పాటకెంత మనసవుతాదో పాటసాగేతలికి పయ నమేమవుతాదో ఆపలేనే ఎంకి ఈ పడవ ఇసురు పాడతేనేఎంకి పదములీ రొదలో' గుండె ల్లో రొదపెట్టు సాగినవి.

అపూర్వ మనసుతెగిన గాలిపటమయ్యింది. ఎవ రన్నారో చూపులదారిల్తో ఎగిరే గాలిపటం జీవితం అని చక్కగా అన్నారు. గాలిపటం ఎగురవేసింది తనే అయినా పటం ఇప్పుడు తన చూపులుదాటి ఎగురుతోంది. కరుణ్ - అప్పటికి ఎన్నిసార్లో ఆ పేరు తల్చుకుని మూల్గింది అపూర్వ.

కరుణ్... కవిత్వం లో పలుకరించేడు.

ఆ చిన్న పల్లెటూరిలో కవిత్వం వినిపిస్తుందని ఊహించనేలేదు.

నాన్నగారి బదిలీతో ఆ పల్లెకు చేరాం.

ఇల్లు సర్దుకోలేదు. ఎక్కడ సామాగ్రి అక్కడే.

ఎదురింటివారే టిఫినూ, భోజనాలూ పంపించేరు. ఇరుగూ పొరుగూ ఏదో ఒక సహకారం చేసేవారు.

సహకారం పల్లెటూరి సహజలక్షణం. ఆ లక్షణమే మా నాన్నను ఆ పల్లెకు ఆకర్షించింది.

తర్వాత్తర్వాత ఆ పల్లెసీమలో స్థిరనివాసి అయిపోయె

రందుక. పట్నంలోని బిల్డింగ్, ఇతర ఆస్తులూ అమ్మేసి ఆ డబ్బుతో పల్లెలో పొలం కొన్నారు.

పొలం సేద్యమూ, ఉద్యోగం రెంటినీ రెండు కళ్ళలా చూసుకొనేవారు నాన్న.

మాకు ఆ పల్లెంటే ఎంతో ఇష్టం.

మా పల్లె తల మీదుగా నాగావళి నది ప్రవహిస్తోంది.

ఒడ్డుల్ని ఒరుసుకుపారే ఆ నాగావళి గల గలలు మా ఇంటికి వినిపిస్తాయి.

వేసవిలో తగ్గిపోయిన నాగావళి మా ఊరివైపు ఇసుక తిన్నెను ప్రసాదిస్తుంది.

ఆ ఇసుక తిన్నెలమీద మా పంచరంగుల కలల గూళ్ళు తొలిసారి కరుణ్ అక్కడే కలిశాడు.

నది ఒడ్డు ఇసుకతిన్నెదాటి నది పాయలుగా చీలినచోట వేసిన ఇసుకతిన్న మీద హైదరాబాద్ నుండి వచ్చిన నా స్నేహితురాలు రోజీతో కబుర్లు కలబోసుకుంటున్న ఓ సాయంత్రం వేళ చేతిలో కృష్ణశాస్త్రి కవితాసంకలనంతో అటేవస్తోన్న కరుణ్‌ను చూసి రోజి అడిగింది ఎవరే ఈ భావికవి? అని. నాకూ తెలీదు అదే మొదట చూడటం.

నిజానికి ఆ పల్లెలో ఇలా ఇసుక తిన్నెలమీదకి షికారుకొచ్చే అలవాటు ఎవరికీలేదు. నీటికోసమో స్నానం కోసమో వచ్చిన వాళ్ళూ కాసేపు ఇసుకలో చతికిలబడి వెళ్ళిపోతుంటారు.

కోడె కారు అయితే మాత్రం గుజ్జన గూళ్ళు కట్టడం, తన్నటం, ఆడటం పరుగెత్తటం చేస్తారు.

అదీ ఆ ముందరీ ఇసుక తిన్నెమీద మాత్రమే.

ఇలా పాయలుగా చీలిన నదీగర్భంలోని ఈ తిన్నె దాకా రారు.

అపుడపుడూ కాదు తరచుగా నేనే వస్తుంటాను.

ఎవరితను? అతనే జవాబిచ్చేడు. ఏనసంతశోకశీకర తిమిరలోకైకపతిని - అప్పుడే చదివాడేమో కృష్ణశాస్త్రి కవిత్వం.

"“నిజంగా భావికవే” మెల్లగా నాతో చెప్పి దారి తప్పారు ప్రభూ! ఇది పురాతన మానవభవనం. మీ ఊహాలోకమూ కాదూ, ఊర్వశీ లేదు.” అని వ్యంగ్యంగా బదులిచ్చింది రోజి.

నాకెందుకో మాట పెగిలిరావటం లేదు. ఆయననే చూస్తూ ఉండిపోయేను.

ఔను సఖీ ఈ విశాల భువనమంతా ఒక పురాతన పాఠశాల” అంటూ చొరవగా మాకు ఎదురుగా ఇసుకపై కూర్చున్నాడు.

రోజి అతని చొరవకు బెదిరి పోయింది. అప్పటికి నేను తేరుకున్నాను. కాస్త కోపంగానే ఏమిటిది? ఎవరు మీరు? ఎందుకిలా వచ్చేరని ప్రశ్నించాను. ఆయన జవాబివ్వలేదు.

నాగావళి నీటిమీద గాలిలా చల్లగా నవ్వేడు.

రోజికి మాత్రం ఇక్కడ ఉండటం ఇష్టంలేక లేచి పదవేపోదాం ఇంటికి అని నన్ను లేపింది.

ఇద్దరమూ లేచాం ఇంటివైపు దారితీశాం “ఛీ ఛీ” మూడ్ అంతా పాడుచేశాడే అని విసుక్కుంది.

ఎందుకోమరి నాకంత విసుగన్పించలేదు. అన్యమనస్కంగా ఉంది. అలా రోజీతో నడుస్తున్నాను. మా వెనకే “ఏల సలిలంబు వారు గాడ్పేల విసురుయేల నా హృదంబు ప్రేమించు నిన్ను” అతని స్వరం నాగావళి మీదగా విన్పిస్తుంటే ఇల్లు చేరాం.

ఆ మరసటిరోజే రోజీ హైదరాబాద్ వెళ్ళి పోయింది...

సాయంత్రం వేళ అలా ఏటివడ్డుకు వెళ్ళాలనిపించేది. మనసొత్తిడి చేసేది గానీ వెళ్ళటానికి ధైర్యం చాలలేదు.

రెండురోజులు ఇంట్లో ఉండిపోయాను. టేపిరికార్డ్ వేసి ఘంటసాల పాటలు వినేదాన్ని.

పాట కరుణ్ దగ్గరకు లాక్కుపోయేది. టేప్‌రికార్డర్ ఆపేసేదాన్ని. మూడవరోజు సాయంత్రం వేళ మరి ఆగలేకపోయాను.

అసంకల్పితంగానే చక్కగా ముస్తాబయ్యాను. ఎర్ర గులాబీ జడలో తురిమాను.

సన్నగా కూనిరాగాల్తో ఇసుక తిన్నె చేరాను. గలగలా నాగావళి సవ్వడి తీరాన్ని అనుకుని ఉన్నరెల్లుపొదల్లోంచి చిరుగాలి... మెత్తగా పాదాల్ని అణువణువునా స్పృశించే ఇసుకరేణువులూ గిలిగింత చుట్టూ ఏకాంతం ప్రొద్దు పడమటికొండల్లో చీకటి కౌగిలిలోకి చేరుతోన్న దృశ్యం, ఏటిఒడ్డున యాతం వేసేవారి పాటా, నీటిలో కడవ ముంచిన శబ్దం - కళ్ళు దిక్కులన్నీ వెదికేయి.

కరుణ్ కన్పించలేదు. అతని స్వరమూ విన్పించలేదు. ఏదో తెలియరాని వెలితి. మరుసటి రోజూ అంతే.

వరసగా మూడు రోజులు మనసు చందమామ కన్పించని ఆకాశమైంది.

గుబులుగా ఉండేది. ఆశనిరాశల నయ్యాటల మధ్య విసుగ్గా ఉండేది. కాళ్ళు ఒకదగ్గర నిలిచేవికావు చూపులు దేనినో వెదకటం.

నాలుగోరోజు రోజి నుండి లెటర్ నాగావళి నది ఇసుకతిన్నె భావకవి ఎంతవరకూ ప్రొగ్రెస్

అర్జంటుగా జవాబు వ్రాయమంది? ఏమని రాయను? ఏం చెప్పను? ఊరంతా గాలించాననా? నాగావళిని ప్రశ్నించాననా? ఇసుక ప్రతి రేణువునీ అతని ఆచూకీ తీయమని పంపాన?

రోజు సాయంత్రం వేళ విసుగెత్తిన వెతుకులాట.

అయిదోరోజు సాయంత్రం నిస్పృహగా వెలుగు కోల్పోయిన పొద్దు పడమరలో మునిగిపోయేట్లుగా - ఇంటివైపు నడుస్తున్నాను.

నదికీ మా ఊరికీ మధ్యనున్న కాలిబాట పొదరిళ్ళతో చిక్కగా ఉంటుంది.


పక్కకు తప్పుకోనే వీలులేని సన్నటి బాట. ఒకరివెనుక ఒకరు పొదరిళ్ళ మధ్య నడుస్తుంటే ఆ దోవ చూడముచ్చటగా ఉంటుంది.

దోవను కాలబాటన వ్రేలితో గీస్తూ ఆలోచిస్తూ తాపీగా నడుస్తున్నా.

నా ఎదురుగా అతను. అదే నవ్వు - నాగావళి గలగలలా విన్పించే నవ్వు?

నా గుండెలు లయతప్పాయి. ఇన్నిరోజులూ ఆయన కోసం వెదికిన నేను... కళ్ళెదుట ఎదురయ్యేసరికి చేష్టలుడిగి నిల్చుండిపోయాను.

ఆయన మాత్రం నన్ను గమనించినట్లుగా ఉంది.




బి. సుధీర్, బి-39/15, లాలే క్వార్టర్స్, కాంచన్‌బాగ్, హైదరాబాద్ - 500 058.

రోజూ సాయంత్రం వేళ నా వెదుకులాట చూసే ఉంటాడు.

సంతోషంగా హాయిగా నవ్వుతూ నాగావళిని తనలోకి అహ్వానించే సముద్రునిలా నిల్చున్నాడు.

ఏటిఒడ్డున దొరికే రకరకాల పూలుతో నా తలమీదగా పుష్పాభిషేకం చేశాడు. ఒళ్ళంతా పులక రించిపోయింది.

పూల మొడిమలు కొన్ని జాకెట్‌లోకి దూరి గుండెల్ని స్పృశించేయి.

రక్తం పాదాల్నుండి శిరస్సు దాకా ఉరకలెత్తిం దోమో - సన్నగా అణువణువూ కంపిం చింది.

కళ్ళు వాలి పోయాయి. వాలిన కనురెప్పల మీద అతని తొలిముద్దు - రక్త ప్రసరణ ఒక్కసారిగా అగి పోయింది.

ఉక్కిరిబిక్కిరై చిరుమెమట చిందింది.

ఆగిన గుండె లయమళ్ళీ స్పీడ్ అందుకుంది.

అప్పటికి తేరుకున్న నేను పచ్చగా అసాయం సంధ్య కాంతిలో సిగ్గుతో మరింత వెలిగిపోతూ గాలికి ఎగిరే రెల్లి పూవులా అతన్ని దాటుకు పారిపోయాను ఇంటికి.

ఆ రాత్రి ఇంట్లో అమ్మా నాన్నల్తో మాట్లాడ్తున్నా పరాధ్యానమే.

ఎందరి మధ్యనున్నా ఒంటిరిగా ఉన్నట్లుండేది.

భోజనాలు అయ్యాక నా గదిలో నామంచం చేరాను. పరుపు ఎప్పటికంటే మెత్తదువుగా అన్పించింది.

తలదిండ్లు ఎన్నివేల కౌగిలించుకొన్నానో చెప్ప లేను. శరీరాన్ని పలుమార్లు చూసుకొన్నాను.

అద్దంలో కనురెప్పల్ని ఎగురవేశాను. ఆ రాత్రి నిదుర అవసరం అన్పించలేదు. నిదురపోయి ఎన్నో మధుర స్మృతుల్ని పోగొట్టుకుంటున్నాం అన్పించింది.

రోజీకు లెటర్ వ్రాద్దామని కలమూ, కాగితం తీశా. ఎన్నాలోచించానో అసలు.

ఆ అనుభూతిని అక్షరాల్లోకి అనువదించగలమా? ఆ రాత్రివేళ అంతా మైమరచి నిద్రిస్తోన్న ఆ సమయాన మళ్ళీ నాగావళి నదికి వెళ్ళాన్పించేది.

నాగావళి పిలుస్తున్నట్లనిప్పంచింది. ఏటిదాకా పరిచిన పాదరిల్లు దారివిప్పి స్వాగతమిస్తున్నట్లన్పించేది.

ఎంత మధురమైన ఊహలో. 'ఎంతో మధుర మీరేయి' అని.

అందుకేనేమో కవి చెప్పగలిగేడు.

'ప్రేమించే హృద యానికి రేయిహాయి గొల్పుతుం దని.

ఆ రోజు డైరీలో రాసుకున్నాను... తర్వాత రోజులూ, క్షణాల్లా గడిచిపోయేవి.

సాయంత్రాల వేళ అనేక మధురాను భూతులు నింపేవి.

చల్లటి చిరుగాలి మా ఇధరు మధ్యలోనే ఉండి పోయేది.

ఇసుకతిన్నె మీద కూర్చుని కరుణ్ నాకోసం ఎదురు చూస్తుండేవాడు.

ఇసుకమీద నేను నడిచొస్తుంటే ప్రియతమా నేను చాలా బీదవాడిని. నా కలలు తప్ప నాకింకేం అస్తిలేదు. నా కలలన్నీ నీ పాదాల చెంతపరిచేను. నా కలలపై నడుస్తావు గనక నా ప్రేమపై దయవుంచి నీయొక్క అడుగులు మెల్లిగా అతి మెల్లిగా వేయి." అని కీట్స్ కవిత్వాన్ని విన్పించేవాడు కరుణ్.

నాగావళి మాకు ప్రసాదించిన బృందావనం శాశ్వత మైతే బాగుణ్ను.

అలా గాలిలో కరుణ్ కవిత్వాన్నీ, కలల్నీ, ఊసుల్నీ వింటూ అలా అలా గడిచిపోతే బాగుణ్ను.

గానీ ఋతుచక్రం చకచకా తిరిగింది.

నాగావళి పొంగిపొర్లింది. మా కలలు తివాచీ కలిసి పోయింది. నదిలో మా బృందావనం మాయమైంది.

ఇటు మా. నాన్న కూడా నన్ను కట్టడీ చేశారు. స్వేచ్ఛాను ఇచ్చినట్లే ఇచ్చి పద్దెనిమిదేళ్ళ పరువాల వయసులో ఇప్పుడు నియంత్రణ ఆరంభించేరు నాన్నగారు.

బతుక్కి అవసర మైన చదువునీ జ్ఞానాన్నీ పొందటానికే స్వేచ్ఛనిచ్చారట. ఇన్నాళ్ళూ ఇక ఓ అయ్య చేతిలో ఈ స్వేచ్ఛను పెట్టేంత దాకా ఈ నియంత్రణ తప్పదన్నారు నాన్న... ఆ అయ్య కరుణ్ కావాలి అన్నాను నేను.

కవిత్వం కడుపాకలి తీర్చదు. కటిక పేదతో సంసార సాగరం ఈదలేవన్నారు నాన్న.

ప్రేమ సాగరంలో మునిగితేలుతోన్న దాన్ని నన్నేం ఆపగలరు?

నాన్న నియంతణ నాలో కరుణ్‌పట్ల ప్రేమని పెంచింది. కరుణ్ కోసం తెగింపు చేయగల ధైర్యం నాలో కల్గింది.

కరుణ్‌తో కలిసి ఏడు అడుగులే కాదు ఏడు గంటల ప్రయాణం చేశాను హైదరాబాద్‌కు...

★



స్టేషన్లు

రాము:- రేడియో రిపేర్ వద్దకు వెళ్ళి మా రేడియోలో అన్ని స్టేషన్లు వస్తాయి. కాని రెండు స్టేషన్లు రావు

రేడియో రిపేర్:- ఏంటవి?

రాము:- ఒకటి రైల్వేస్టేషను రెండు పోలిస్‌స్టేషన్

-పి. వాగరామరాజు, తాళ్ళపల్లి (పోస్ట్), పులివెందుల (తాలూకా), కడప జిల్లా




కె. రవిప్రసాద్, చెల్పూర్ (పోస్ట్), హుజూరాబాద్ (మం), కరీంనగర్ జిల్లా